నేడు 'రైతు నేస్తం' కార్యక్రమం ప్రారంభం

వికారాబాద్ జిల్లా వ్యవసాయాధికారి గోపాల్

వికారాబాద్, మార్చి 18 : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన వీడియో కాన్ఫరెన్స్ సిస్టం ద్వారా రైతుల సమస్యలను పరిష్కరించనున్నామని వికారాబాద్ జిల్లా వ్యవసాయాధికారి గోపాల్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. రైతు వేదికల నుంచి శాస్త్రవేత్తలు ఇచ్చే సూచనలు, సలహాలను విని వారి సమస్యలను నివృత్తి చేసుకొనుటకు సౌకర్యవంతంగా ఉంటుందన్నారు. నియోజకవర్గానికి ఒకటి చొప్పున వికారాబాద్ జిల్లాలో 4 రైతు వేదికల్లో వీడియో కాన్ఫరెన్ సిస్టం ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. కొడంగల్ నియోజకవర్గం బొంరాస్‌పేట్ రైతు వేదిక, తాండూరు నియోజకవర్గంలోని యాలాల రైతు వేదిక, వికారాబాద్ నియోజకవర్గం మోమిన్‌పేట రైతు వేదిక, పరిగి నియోజకవర్గం పూడూరు రైతు వేదికలో వీడియో కాన్ఫరెన్స్ సిస్టంలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రతి మంగళవారం రైతు నేస్తం కార్యక్రమంలో భాగంగా ఉదయం 10 నుంచి 11:30 గంటల వరకు నేరుగా వీక్షించే అవకాశం కల్పించామన్నారు. 19వ ఉదయం 10 గంటలకు రైతు నేస్తం కార్యక్రమం ప్రారంభమవుతుందని తెలిపారు. ఈ వారం వరిలో ప్రస్తుతం పాటించవలసిన మెళకువలపై డాక్టర్ శ్రీనివాస్ జగిత్యాల నుంచి రైతులకు సూచనలను అందజేస్తారన్నారు. ఆయిల్ పామ్ సాగులో తీసుకోవలసిన మెళకువలపై డాక్టర్ రాజశేఖర్, కొండా లక్ష్మణ్ ఉద్యాన విశ్వవిద్యాలయం డీఎస్ రైతులకు సూచనలు, సలహాలు ఇవ్వనున్నట్లు తెలిపారు. వేసవిలో సాగు చేసే కూరగాయలు వాటిపై వాడే పురుగు మందులు అవశేషాల గురించి రైతులకు వివరిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ కవిత రైతుల సందేహాలకు సమాధానం ఇస్తారన్నారు. రైతులు తమ తమ రైతు వేదికల నుంచి ఈ సదవకాశాన్ని వినియోగించుకోవాలని ఆయన తెలిపారు.

ఉత్తమ ఫలితాలు సాధించాలి

వికారాబాద్ కలెక్టర్ నారాయణరెడ్డి పరీక్షా కేంద్రాల తనిఖీ

వికారాబాద్‌లో ఓ పరీక్షా కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న కలెక్టర్ నారాయణరెడ్డి

వికారాబాద్, మార్చి 18 : పదో తరగతి పరీక్షలను నిర్భయంగా రాసి ఉత్తమ ఫలితాలు సాధించాలని వికారాబాద్ కలెక్టర్ నారాయణ రెడ్డి తెలిపారు. సోమవారం కలెక్టర్ వికారాబాద్‌లోని జిల్లా పరిషత్ ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ప్రతి రూమ్‌కు వెళ్లి పరిశీలిస్తూ పరీక్షలు రాసే విద్యార్థులు పక్క వారితో మాట్లాడరాదని, మాస్ కాపీయింగ్ జరుగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. పాఠశాలలో 240 మంది విద్యార్థులకు 239 మంది హాజరయ్యారని చీఫ్ సూపరింటెండెంట్ కలెక్టర్‌కు తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులకు తాగునీరు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు ఇతర సౌకర్యాలను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ప్రతి ఒక్కరినీ తనిఖీ చేసిన తర్వాత లోనికి పంపాలని, సెల్‌ఫోన్‌ను అనుమతించవద్దన్నారు. ఎలాంటి లోటుపాట్లకు తావు లేకుండా పరీక్షలు ప్రశాంతంగా, సజావుగా జరిగేలా చూడాలని కలెక్టర్ తెలిపారు. కలెక్టర్ వెంట చీఫ్ సూపరింటెండెంట్ సునీత, అబ్జర్వర్ వినయ కుమార్, సంబంధిత అధికారులు ఉన్నారు.

100 శాతం పనులు పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలి

ఉపాధి హామీ పనుల్లో కూలీల సంఖ్యను పెంచి 100 శాతం పనులు పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు. టెలీ కాన్ఫరెన్స్ ద్వారా సంబంధిత అధికారులకు సీసీ రోడ్లు, లేబర్ మొబిలైజేషన్‌కు సంబంధించి దిశా నిర్దేశం చేశారు. గ్రామ పరిధిలో ఎన్ఆర్ఈజీఎస్ వ్యవస్థను బలోపేతం చేస్తూ కూలీల సంఖ్యను పెంచుతూ పనులు 100 శాతం పనులు పూర్తి చేయాలన్నారు. గ్రామాల్లో జాబ్ కార్డు ఉన్నవారందరికీ పని కల్పిస్తూ ముందుకు వెళ్లాలని ఆదేశించారు. అంచనా ప్రకారం కూలీల సంఖ్యను పెంచుకోవాలని సూచించారు. గ్రామ పరిధిలో ఉండే చిన్న చిన్న సమస్యలను మండల అధికారుల దృష్టికి తీసుకురావాలని ఆదేశించారు. ఇప్పటి వరకు పూర్తయిన వాటికి ఎఫ్‌టీవో తప్పనిసరిగా జనరేట్ చేయాలన్నారు. ఏ మండలంలో ఏ తేదీ వరకు ఎఫ్‌టీవో జనరేట్ అయినది, ఇంకా చేయాల్సినవి ఎన్ని ఉన్నాయో టీఏలందరూ చెక్ చేసుకునేలా చర్యలు తీసుకోవాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. టెలీ కాన్ఫరెన్స్‌లో డీఆర్‌డీఏ శ్రీనివాసులు, జిల్లా పంచాయతీ అధికారి సుధారాణి పాల్గొన్నారు.

బీఆర్ఎస్ సత్తా చాటాలి

కందుకూరు బీఆర్ఎస్ పార్టీ నాయకులతో ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి

ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి

కందుకూరు, మార్చి 18 : పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ సత్తాచాటాలని మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి తెలిపారు. సోమవారం మండల ఎంపీటీసీల ఫోరం అధ్యక్షుడు సురుసాని రాజశేఖర్‌రెడ్డి, నియోజకవర్గం యూత్ వర్కింగ్ ప్రెసిడెంట్ తాళ్ల కార్తీక్, యూత్ నాయకుడు బొక్క దీక్షిత్ రెడ్డితో కలిసి ఆమె మాట్లాడుతూ.. కొంత మంది స్వార్థపరులు పార్టీ మారుతున్నారని.. అయినా పార్టీకి ఎలాంటి నష్టం లేదని.. ప్రజల అండ ఉన్నంతవరకు బీఆర్ఎస్ పార్టీని ఎవరూ ఏమీ చేయలేరని పేర్కొన్నారు. గుర్తింపు లేని వారికి టికెట్ ఇచ్చి గెలిపిస్తే.. కేసీఆర్ మేలు మర్చిపోయి పార్టీని వీడటం సమంజసం కాదని హితవు పలికారు. చేవెళ్ల బీఆర్ఎస్ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్‌ను గెలిపించుకొని.. బీఆర్ఎస్ సత్తా ఏంటో చూపాలని కార్యకర్తలను కోరారు. ఇటీవల పార్టీ మారిన కొంతమంది బీఆర్ఎస్ నాయకుల వద్దకు వచ్చి కాంగ్రెస్ పార్టీలో చేరాలని ఒత్తిడి తెస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. పార్లమెంట్ స్థానాన్ని గెలిపించి.. కష్టకాలంలో కేసీఆర్‌కు అండగా ఉండాలని కోరారు. కార్యక్రమంలో యూత్ నాయకులు గొర్రెంకల రామకృష్ణ ముదిరాజ్, రాకేశ్‌రెడ్డి ఉన్నారు.

తిమ్మారెడ్డిగూడలో బీరప్ప బోనాల ఊరేగింపులో పోతురాజుల విన్యాసాలు

ఘనంగా బీరప్ప బోనాలు

బోనాల ర్యాలీ నిర్వహిస్తున్న మహిళలు

షాబాద్, మార్చి 18 : షాబాద్ మండలం తిమ్మారెడ్డిగూడలో బీరప్ప బోనాల ఉత్సవాలు, జాతర కార్యక్రమం అంగరంగ వైభవంగా నిర్వహించారు. సోమవారం ఉదయం నుంచి భక్తులంతా గ్రామ సమీపంలోని బీరప్ప దేవాలయం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం వేదపండితుల మంత్రోచ్చరణల మధ్య బీరప్ప కల్యాణం వైభవంగా జరిపించారు. అనంతరం మహిళలు బోనాల ఊరేగింపు చేపట్టారు. ఊరేగింపులో శివసత్తుల పూనకాలు, పోతురాజుల విన్యాసాలు, యువకుల కేరింతలతో గ్రామం మార్మోగింది. చేవెళ్ల నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి భీంభరత్, మాజీ ఎంపీ విశ్వేశ్వర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే కే.ఎస్ రత్నం తదితరులు పూజల్లో పాల్గొన్నారు. కార్యక్రమంలో గ్రామ మాజీ సర్పంచ్ శకుంతల, ఎంపీటీసీ సునీత, పీఏసీఎస్ వైస్ చైర్మన్ మల్లేశ్, మాజీ ఎంపీటీసీ పాండు ఉన్నారు.

రావిచేడ్‌లోని శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి ఆలయం

నేటి నుంచి వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు

ఐదు రోజులపాటు జరుగనున్న ఉత్సవాలు

ఏర్పాట్లు పూర్తి చేసిన ఆలయ నిర్వాహకులు



ఆలయంలోని దేవతామూర్తులు

కడ్తాల్, మార్చి 18 : మండల పరిధిలోని రావిచేడ్ గ్రామంలో కొలువైన శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామివారి బ్రహ్మోత్సవాలు నేటి నుంచి ప్రారంభం కానున్నాయి. బ్రహ్మోత్సవాల సందర్భంగా ఆలయ నిర్వాహకులు ఆలయాన్ని శోభాయమానంగా ముస్తాబు చేశారు. మంగళవారం నుంచి ఈ నెల 23 వరకు బ్రహ్మోత్సవాలు జరుగనున్నాయి. గ్రామ ప్రధాన అర్చకులు వింజమూరి రామానుజాచార్యులు, ఆచార్య ఆదిత్యశర్మ, చిందంబర శర్మ, శిరీష్‌కుమార్ పర్యవేక్షణలో బ్రహ్మోత్సవాలు నిర్వహించనున్నామని ఆలయ అనువంశిక ధర్మకర్త రాంచందర్‌రావు, ఎంపీటీసీ గోపాల్, మాజీ సర్పంచ్ లక్ష్మీదేవి, మాజీ ఉప సర్పంచ్ వెంకటేశ్, నిర్వాహకులు తెలిపారు.

బ్రహ్మోత్సవాల వివరాలు

మంగళవారం ఉదయం స్వామివారికి అభిషేకం, అంకురార్పణం, తీర్థప్రసాద వితరణ, సాయంత్రం అగ్ని ప్రతిష్ఠ, సహస్ర నామార్చన, 20న నిత్యారాధన, ధ్వజరోహణం, తీర్థప్రసాద వితరణ, రాత్రి 8 గంటలకు గరుడ వాహన సేవ, ఎదుర్కోళ్లు, సీతా రామాంజనేయస్వామి, రామలింగేశ్వర స్వామి భజన మండలి కార్యక్రమాలు, 21న మధ్యాహ్నం 12 గంటలకు శ్రీదేవి, భూదేవి సమేత శ్రీనివాస కల్యాణోత్సవం, అన్నప్రసాద వితరణ, రాత్రికి భజనలతో గ్రామోత్సవం, 22న నిత్య పూజా కార్యక్రమం, పారాయణం, అర్చనలు, తీర్థప్రసాద వితరణ, అమ్మవార్లకు కుంకుమార్చనలు, ధార్మిక ప్రసంగాలు, భజనలు, రాత్రికి గొర్రె పొట్టేళ్లతో ప్రభోత్సవం, హోమం, రథోత్సవం, 23న సామూహిక సత్యనారాయణస్వామి వారి వ్రతాలు, చక్రతీర్థం, మహా పూర్ణాహుతి, శకటోత్సవం, వాహనాలతో గిరి ప్రదక్షిణ, ధ్వజ అవరోహణం, సాయంత్రం ఆలయ పూజా రిచే భక్తులకు దివ్యానుగ్రహ భాషణ మంగళాశాసనములతో బ్రహ్మోత్సవాలు ముగుస్తాయని ఆలయ నిర్వాహకులు వివరించారు. ఉత్సవాలకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ఏర్పాట్లు చేశామని వారు పేర్కొన్నారు.



కడ్తాల్ : తలకొండపల్లి మండల పరిధిలోని చంద్రధన గ్రామంలో నూతనంగా డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. ఈ మేరకు సోమవారం ఉదయం హైదరాబాద్‌లో నాగర్‌కర్నూల్ పార్లమెంట్ సభ్యుడు పోతుగంటి రాములును అంబేద్కర్ గ్రామ కమిటీ నాయకులు కలిసి ఆహ్వాన కరపత్రాలను అందజేశారు. ఈ నెల 26న నిర్వహించే అంబేద్కర్ విగ్రహావిష్కరణ కార్యక్రమానికి హాజరు కావాలని ఎంపీని కోరినట్లు నాయకులు తెలిపారు.

లక్ష్యం అధిగమించేనా?

ఆస్తిపన్ను వసూళ్లపై 'ఎన్నికల' పిడుగు

ఆర్థిక సంవత్సరం ముగుస్తున్న వేళ..

నిర్దేశిత లక్ష్యం దాటడం అనుమానమే

రూ. 2100కోట్ల టార్గెట్‌లో

వసూలైంది రూ. 1488.47కోట్లు మాత్రమే

-మరో 13 రోజుల్లో 22 శాతం చేరడం కష్టసాధ్యమే

సిటీబ్యూరో, మార్చి 18 (నమస్తే తెలంగాణ) : ఆస్తిపన్ను వసూళ్లలో వేగం పెంచిన జీహెచ్ఎంసీపై పార్లమెంట్ ఎన్నికల కోడ్ ప్రభావం చూపనున్నది. ఇప్పటికే గత ఏడాది అసెంబ్లీ ఎన్నికలు, కొత్త సర్కారులో ప్రజాపాలన సందర్భంగా అధికారులు సంబంధిత విధుల్లో నిమగ్నం కావడంతో ఆస్తిపన్ను కలెక్షన్లు ఆశించిన స్థాయిలో రాలేదు. ఈ నేపథ్యంలోనే 2023-24 ఆర్థిక సంవత్సరంలో రూ.2100 కోట్ల నిర్దేశిత లక్ష్యంలో ఇప్పటి వరకు కేవలం రూ.1488.47 కోట్లు మాత్రమే వసూలైంది. రాబోయే 13 రోజుల్లో ఆర్థిక సంవత్సరం గడువు ముగుస్తుండడం.. 70.88 శాతం మాత్రమే వసూలు కావడం..అందులో పార్లమెంట్ ఎన్నికల విధుల్లో చాలా మంది అధికారులు, సిబ్బంది ఉండటంతో నిర్దేశిత లక్ష్యాన్ని అధిగమించడం జీహెచ్ఎంసీకి కత్తిమీద సాములా మారిందనే చెప్పవచ్చు. వాస్తవంగా ఈ నెల మొదటి వారంలోనే ఆస్తిపన్ను బకాయిదారులపై జీహెచ్ఎంసీ బంపర్ ఆఫర్ ప్రకటించింది. బకాయిలపై 90 శాతం వడ్డీ రాయితీ అందిస్తూ వన్ టైం సెటిల్‌మెంట్ (ఓటీఎస్) స్కీంను అందుబాటులోకి తీసుకొచ్చింది. ఓటీఎస్ ద్వారా దాదాపు రూ.500కోట్ల మేర ఆదాయం రావొచ్చని అధికారులు అంచనా వేశారు. కానీ అంచనాలు తలకిందులయ్యాయి. 18 రోజుల్లో రూ.55 కోట్ల మేర మాత్రమే ఓటీఎస్ కలెక్షన్లు వచ్చాయి. ఆస్తిపన్ను వసూళ్లలో వేగం పెంచడం, ఓటీఎస్, ప్రతి ఆదివారం ప్రాపర్టీ ట్యాక్స్ పరిష్కార వేదికలను నిర్వహణ పర్యవేక్షణకు సర్కిల్ వారీగా ఐఏఎస్‌ల నుంచి ఉన్నతాధికారుల వరకు ప్రత్యేక అధికారులుగా నియమించినప్పటికీ ఫలితాలు మాత్రం పెద్దగా లేవనే చెప్పాలి. ఈ సమయంలోనే ఈ నెలలో రూ.685.85 కోట్ల టార్గెట్‌లో కేవలం రూ.76 కోట్ల మేర మాత్రమే వసూలయ్యాయి. రాబోయే 13 రోజుల్లో 22 శాతం వసూళ్లను రాబట్టడం, అందులో ఎన్నికల విధులు, వరుస సెలవులు వస్తుండడం అధికారులకు సవాల్‌గా మారింది. మొత్తంగా ఈ ఏడాది నిర్దేశిత లక్ష్యం అధిగమించడం కష్ట సాధ్యమేనన్న వాదనలు వినిపిస్తున్నాయి.

2023-24 ఆర్థిక సంవత్సర ఆస్తిపన్ను వివరాలు

జోన్	నిర్దేశిత లక్ష్యం(రూ.కోట్లలో)	వసూళ్లు
ఎల్బీనగర్	320.94	207.11
చార్మినార్	150.91	108.56
ఖైరతాబాద్	546.07	373.02
శేరిలింగంపల్లి	447.28	342.45
కూకట్‌పల్లి	346.95	258.05
సికింద్రాబాద్	287.85	199.27

మాది కాదు.. మీదే బాధ్యత!

అనుమతులే మా వంతు..

అనధికార నిర్మాణాలను అరికట్టడం మీ బాధ్యతే

స్థానిక సంస్థలకు హెచ్ఎండీఏ లేఖలు

అక్రమ నిర్మాణాలపై చేతులెత్తేసిన వైనం

అధికారుల మధ్య కరువైన సమన్వయం

సిటీబ్యూరో, మార్చి 18 (నమస్తే తెలంగాణ): 'తాంబూలాలిచ్చేశాం.. తన్నుకు చావండి'అన్నట్లు వ్యవహరిస్తున్నది హైదరాబాద్ మెట్రో పాలిటన్ డెవలప్‌మెంట్ అథారిటీ. అక్రమ నిర్మాణాలు, లేఅవుట్ల విషయంలో చేతులెత్తేస్తున్నది. భవన నిర్మాణాలకు, లేఅవుట్లకు అనుమతులివ్వడమే కాదు... వాటిని సక్రమంగా హెచ్ఎండీఏ నిబంధనలకు అనుగుణంగా నిర్మిస్తున్నారో లేదో పర్యవేక్షిస్తూ అనధికార నిర్మాణాలను అడ్డుకోవాల్సిన పూర్తి బాధ్యత హెచ్ఎండీఏపైనే ఉన్నది. అయినా ఈ విషయంలో అధికారులు హెచ్ఎండీఏ పరిధిలో ఉన్న లోకల్ బాడీస్ (స్థానిక సంస్థలు)కు పూర్తి స్థాయిలో డెలిగేషన్ పవర్స్ ఇచ్చేశామంటూ పాలసీ విధానాలను చెబుతున్నారే తప్ప, అక్రమాల జోలికి వెళ్లడం లేదు. ఫలితంగా క్షేత్ర స్థాయిలో అక్రమ నిర్మాణాలే కాదు.. లేఅవుట్లు సైతం యథేచ్ఛగా కొనసాగుతున్నాయి. అధికారుల నిర్లక్ష్యం కారణంగా ప్రణాళికాబద్ధంగా నిర్మాణాలు జరగాల్సి చోట అక్రమ నిర్మాణాలే అధికంగా వెలుస్తున్నాయని నగర వాసులు ఆరోపిస్తున్నారు.

లేఖ రాసినా..

బండ్లగూడ జాగీర్ మున్సిపాలిటీ పరిధిలో ఒక కాలనీలో చేపడుతున్న జీ ప్లస్ 5 అపార్ట్‌మెంట్ నిర్మాణానికి హెచ్ఎండీఏ పరిధిలోని శంకర్‌పల్లి జోన్ ప్లానింగ్ విభాగం అధికారులు అనుమతులిచ్చారు. దీనిపై స్థానికులు హెచ్ఎండీఏ ఇచ్చిన అనుమతులకు అనుగుణంగా నిర్మాణాలు చేపట్టడం లేదని, సెట్ బ్యాక్స్ సరిగా లేకుండా నిర్మాణం చేస్తున్నారని ఫిర్యాదు చేస్తే దాన్ని క్షేత్ర స్థాయిలో పరిశీలించి అడ్డుకోవాల్సిన హెచ్ఎండీఏ అధికారులు.. కేవలం బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ (బీజెఎంసీ) కమిషనర్‌కు లేఖ రాసి చేతులు దులుపుకొన్నారు. ఈ లేఖపైనా స్థానిక సంస్థ అధికారులు సైతం ఎలాంటి చర్యలు తీసుకోలేదు. హెచ్ఎండీఏ అనుమతిచ్చిన ప్లాన్ ప్రకారం కాకుండా చుట్టూ డీవియేషన్స్‌తో చేపట్టిన నిర్మాణాన్ని మాత్రం ఇప్పటికీ అడ్డుకోలేదు. దీనిపై కాలనీ వాసులు హెచ్ఎండీఏ కార్యాలయం, స్థానిక సంస్థ బీజేఎంసీ కార్యాలయం చుట్టూ అనేక సార్లు తిరిగినా ఫలితం లేకుండా పోయింది తప్ప, అధికారులెవరూ అక్రమ నిర్మాణంపై ఎలాంటి చర్యలు తీసుకోలేదు. ఇదిలా ఉంటే అనుమతుల ప్రకారం భవనాల నిర్మాణాలు జరగడం లేదని ఫిర్యాదు చేస్తే మాత్రం హెచ్ఎండీఏ చట్టం-2008 సెక్షన్ 23(2) ప్రకారం డెలిగేషన్ పవర్స్‌ను స్థానిక సంస్థలకు ఇచ్చామని, దానికి సంబంధించిన నంబరు (లెటర్ నంబరు 803/పాలసీ/పీఎల్‌జీ/హెచ్ఎండీఏ/2020 (19-03-2020)న జారీ చేసిన లేఖను ఫిర్యాదు దారులకు చూపిస్తున్నారు. అక్రమ నిర్మాణాలను అడ్డుకోవడంపై సమాచార హక్కు చట్ట ప్రకారం హెచ్ఎండీఏను వివరణ కోరినా అధికారులు ఇదే విషయాన్ని చెబుతున్నారే తప్ప, ఆఫీసు దాటి బయటకు వచ్చి క్షేత్ర స్థాయిలో జరుగుతున్న అక్రమ నిర్మాణాలు, లేఅవుట్ల విషయంలో ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.

ప్రభుత్వ సంస్థల సమన్వయం కరువు..

హెచ్ఎండీఏ పరిధిలోని బాకారం గ్రామ రెవెన్యూ పరిధిలోని 8 ఎకరాల విస్తీర్ణంలో మొత్తం 12 విల్లాలను పూర్తిగా నిబంధనలకు విరుద్ధంగా కట్టారని, వాటిని కూల్చివేయాలంటే కొందరు హెచ్ఎండీఏకు ఫిర్యాదు చేశారు. దానికి హెచ్ఎండీఏ అధికారులు అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోవాలని గ్రామ పంచాయతీకి ఆదేశాలిచ్చారు. దీనికి గ్రామ పంచాయతీ అధికారులు కూల్చివేయడానికి పోలీస్ బలగాలు కావాలని అని హెచ్ఎండీఏకు, జిల్లా కలెక్టర్‌కు లేఖ రాశారు. ఇలా అక్రమ నిర్మాణాలను అడ్డుకునే విషయంలో తీవ్ర జాప్యం జరుగుతుండగా, ప్రభుత్వ సంస్థల మధ్య సమన్వయం కరువైందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

బిస్వాల్ ప్రభాస్ (ఫైల్)

మరణిస్తూ.. జీవించాడు

ఖైరతాబాద్, మార్చి 18 : తాను మరణిస్తూ అవయవదానం ద్వారా జీవించాడు. రంగారెడ్డి జిల్లా వట్టినాగులపల్లికి చెందిన బిస్వాల్ ప్రభాకర్, పింకీ దంపతుల కుమారుడు బిస్వాల్ ప్రభాస్ (19). ఈ నెల 14న ఆటో ఢీకొట్టగా తీవ్రంగా గాయపడ్డాడు. కుటుంబ సభ్యులు గచ్చిబౌలిలోని కాంటినెంట్ దవాఖానకు తరలించారు. ఈ చికిత్స అందిస్తున్న వైద్యులు ఈ నెల 17న బ్రెయిన్ డెడ్‌గా నిర్ధారించారు. కుటుంబ సభ్యులను కలిసిన జీవన్‌దాన్ ప్రతినిధులు.. అవయవదానం విశిష్టతను వివరించగా, అందుకు వారు అంగీకరించారు. బిస్వాల్ నుంచి కాలేయం, రెండు మూత్రపిండాలను సేకరించారు.

జీహెచ్ఎంసీ టోల్ ఫ్రీ నంబర్ కోసం వెతికితే..

రిటైర్డు ఉద్యోగి బ్యాంకు ఖాతా నుంచి డబ్బులు మాయం

వెంగళరావునగర్, మార్చి 18 : జీహెచ్ఎంసీకి ఫిర్యాదు చేసేందుకు ప్రయత్నించిన ఓ వ్యక్తి.. సైబర్ నేరగాళ్ల చేతికి చిక్కి డబ్బులు పోగొట్టుకున్నాడు. ఎస్ఆర్‌నగర్ డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్ జి.జానకీ రాములు కథనం ప్రకారం.. ఎస్ఆర్ నగర్‌లోని ఓ భవనం 5వ అంతస్తులో ఉంటున్న రిటైర్డ్ ఉద్యోగి వెంకట రంగనాథ్ చావా(69) ఇంటి వైపు పక్కనే ఉన్న ఓ హోటల్‌కు చెందిన పొగ గొట్టం రావడంతో ఇబ్బంది పడుతున్నారు. సమస్యను జీహెచ్ఎంసీకి ఫిర్యాదు చేసేందుకు టోల్‌ఫ్రీ నంబర్ కోసం గూగుల్‌లో వెతికారు. జీహెచ్ఎంసీ టోల్‌ఫ్రీ నంబరుగా భావించి.. ఓ ఫోన్ నంబర్‌కు కాల్ చేసి తమ సమస్యను వివరించాడు. సమాచారం సేకరించిన అవతలి వ్యక్తి.. ఫిర్యాదు నమోదు చేసుకునేందుకు రూ.2 ప్రాసెసింగ్ ఫీజు చెల్లించాలని సూచించాడు. దీంతో బాధితుడు గూగుల్ పే నంబర్‌కు రూ.2 చెల్లించాడు. అనంతరం ఆగంతకుడు ఫోన్ డిస్‌కనెక్ట్ చేశాడు. ఆ వెంటనే రంగనాథ్ చావా ఖాతా నుంచి మూడు సార్లు రూ.25 వేలు, మరో రూ.25 వేలు, మరోసారి రూ.2200 విత్‌డ్రా అయినట్లు మెసేజ్ వచ్చింది. తాను మోసపోయానని గ్రహించిన బాధితుడు ఎస్ఆర్ నగర్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

మర్పల్లి : దైవచింతనతో మానసిక ప్రశాంతత కలుగుతుందని వికారాబాద్ ఎమ్మెల్యే, అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ అన్నారు. సోమవారం మండలంలోని కొంషట్‌పల్లి గ్రామంలో నిర్వహించిన బీరప్ప జాతరలో పాల్గొని పూజలు చేశారు.

ఎంపీ రంజిత్‌రెడ్డి అవకాశవాది

ఎంపీ రంజిత్‌రెడ్డి దిష్టి బొమ్మను దహనం చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

ఆర్కేపురం, మార్చి 18 : చేవెళ్ల ఎంపీ రంజిత్‌రెడ్డి బీఆర్ఎస్ పార్టీని వీడి కాంగ్రెస్ పార్టీలో చేరడాన్ని నిరసిస్తూ బీఆర్ఎస్ పార్టీ ఆర్కేపురం డివిజన్ వర్కింగ్ ప్రెసిడెంట్ కంచర్ల శేఖర్, డివిజన్ ప్రధాన కార్యదర్శి సిద్దగోని వెంకటేశ్‌గౌడ్ ఆధ్వర్యంలో ఎన్టీఆర్‌నగర్ చౌరస్తాలో ఎంపీ రంజిత్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. బీఆర్ఎస్ పార్టీ అధికారంలో ఉన్నన్ని రోజులు పదవులు అనుభవించి పార్టీ మారడం సిగ్గుచేటని పేర్కొన్నారు. ప్రజాసేవ కోసమే రాజకీయాల్లోకి రావాలి తప్ప అధికారమే పరమావధిగా పార్టీలు మారడం దివాలాకోరుతనానికి నిదర్శనమని పేర్కొన్నారు. బీఆర్ఎస్ పార్టీ రంజిత్‌రెడ్డికి ఎంత ప్రయారిటీ ఇచ్చిందో ఒక్కసారి ఆలోచించుకోవాలని తెలిపారు. అవకాశవాదులు ఏ పార్టీ అధికారంలో ఉంటే అందులోకి వెళ్తారని, అలాంటి వారికి ప్రజలు తగిన బుద్ధి చెపుతారన్నారు. బీఆర్ఎస్ పార్టీని ఎవరు వీడినా ఒరిగేదేమీ లేదని, పార్టీకి ఉద్యమకారులు అండగా ఉంటారని వారు తెలిపారు.

వడ్డేపల్లి రాంచందర్‌కు సన్మానం

నేషనల్ కమిషన్ ఫర్ షెడ్యూల్ క్యాస్ట్ మెంబర్‌గా నియమితులైన రాంచందర్‌ను సన్మానిస్తున్న జీఎస్ఐ సదరన్ రీజియన్ ఎస్సీ, ఎస్టీ వెల్ఫేర్ అసోసియేషన్ చైర్మన్, రీజినల్ సెక్రటరీ

మన్సూరాబాద్, మార్చి 18: నేషనల్ కమిషన్ ఫర్ షెడ్యూల్ క్యాస్ట్ మెంబర్‌గా నియమితులైన వడ్డేపల్లి రాంచందర్‌ను నగరంలోని డైరెక్టర్ నేషనల్ కమిషనర్ కార్యాలయంలో సోమవారం జీఎస్ఐ సదరన్ రీజియన్ ఎస్సీ, ఎస్టీ వెల్ఫేర్ అసోసియేషన్ చైర్మన్ ఆదర్ల మహేశ్, రీజినల్ సెక్రటరీ మధిర సత్యనారాయణ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఎల్బీనగర్, బండ్లగూడలోని జీఎస్ఐ కార్యాలయాన్ని సందర్శించాలని నేషనల్ కమిషనర్ ఫర్ షెడ్యూల్ క్యాస్ట్ మెంబర్‌గా నియమితుడైన వడ్డేపల్లి రాంచందర్‌ను కోరడం జరిగిందని జీఎస్ఐ సదరన్ రీజియన్ ఎస్సీ, ఎస్టీ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు తెలిపారు. జీఎస్ఐ కార్యాలయంలో రెగ్యులర్‌గా రోస్టర్ మెయింటెనెన్స్ జరుగుతుందో లేదో ఇన్విజిలేటర్ ద్వారా తనిఖీ చేయించాలని కోరడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ ప్రతినిధులు బి. ఆనంద్‌కుమార్, ఎన్‌టీ బాబు, విఠల్ తదితరులు పాల్గొన్నారు.